కలగానే కళాశాల..

- 19 ఏళ్లు గడిచినా పూర్తికాని భవనం
- నిర్మాణ పనులకు రెండుసార్లు శంకుస్థాపన
- భూ వివాదంతో నిలిచిన నిర్మాణం
- సొంత భవనం కోసం ఎదురుచూపు



అసంపూర్తిగా ఉన్న కళాశాల భవన నిర్మాణం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు(ఫైల్‌)

సుదీర్ఘకాలం నాటి కల నెరవేరుతుందని పట్టణ ప్రజలు, విద్యార్థులు సంబుర పడ్డారు. కళాశాల సొంత భవనం ఎప్పుడెప్పుడు పూర్తవుతుందని రెండు దశాబ్దాలుగా ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. కానీ వారి ఆశలను అడియాశలు చేస్తూ, భూ వివాదం కారణంగా మరోసారి భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

ఆమనగల్లు: ప్రభుత్వ జూనియర్‌ కళాశాల నిర్మాణ పనులకు గ్రహణం వీడటం లేదు. భూ వివాదం కారణంగా మరోసారి నిర్మాణ పనులకు ఆటంకం కలిగింది. పట్టణంలో జూనియర్‌ కళాశాలను ప్రభుత్వం 2000 సంవత్సరంలో ఏర్పాటు చేసింది. అప్పట్లో భవనం అందుబాటులో లేకపోవడంతో, స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల భవనంలోనే కొన్ని గదులు కేటాయించి కళాశాలను ప్రారంభించారు. మూడు గదులు మాత్రమే కేటాయించడంతో విద్యార్థులకు చెట్ల కింద చదువులు తప్పడం లేదు. దీనికి తోడు అందులోనే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పెరిగాయి.

2006లో ప్రారంభం..

కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో దివంగత నేత, నాటి ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి దాతల సహకారంతో 9.15 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. 2006లో నాటి కేంద్ర మంత్రి, దివంగత నేత జైపాల్‌రెడ్డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించిన కొద్ది రోజులకే భూ వివాదం తలెత్తడంతో పనులు నిలిచిపోయాయి. అప్పట్లో భూమిని కొనుగోలు చేసి, ప్రభుత్వం పేరిట రిజిస్ట్రేషన్‌ చేయించారు. అయితే దీనిపై కొందరు ఆ భూమిపై తమకు హక్కులు ఉన్నాయని కోర్టుకు వెళ్లడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

రూ.2 కోట్లు మంజూరు

కళాశాల పనులు నిలిచిపోవడంతో విద్యార్థి సంఘాలు ఆందోళన బాటపట్టాయి. దీంతో మరోసారి 2022లో నాటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌.. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ద్వారా రూ.2 కోట్లు మంజూరు చేయించారు. అనంతరం అప్పటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అదే ఏడు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభమైనప్పటికీ, కోర్టు కేసుల కారణంగా రెండోసారి నిర్మాణ పనులకు ఆటంకం కలగడంతో విద్యార్థి సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కలెక్టర్‌ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ తీసుకుని కళాశాల భవనాన్ని పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రయాణికుల భద్రత ముఖ్యం

- వారిని గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత మీదే
- బస్సు నడుపుతూ సెల్‌ఫోన్‌ మాట్లాడొద్దు
- ఆర్టీసీ డ్రైవర్లకు ఆర్టీఏ అధికారుల సూచన



డ్రైవర్లకు రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ అనూష

ఇబ్రహీంపట్నం: 'ప్రయాణికుల భద్రత ముఖ్యం. వారి ప్రాణాలు మీ చేతుల్లో ఉన్నాయి. వారిని గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత మీదే. డ్రైవింగ్‌ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. సెల్‌ఫోన్‌ అసలే మాట్లాడవద్దు' అని ఏఎంవీఐలు అనూష, రాఘువులు అన్నారు. ఇబ్రహీంపట్నం రవాణాశాఖ ప్రాంతీయ అధికారి సుభాష్‌ చందర్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పట్నం ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేయడం ప్రమాదకరమని, డ్రైవింగ్‌ చేసేటప్పుడు సెల్‌ఫోన్‌, వాట్సప్‌ మెసేజ్‌లకు రెస్పాండ్‌ కావొద్దని సూచించారు. వాహనాలను దాటి వెళ్లే క్రమంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత అంశాలపై పలు సూచనలను, సలహాలు ఇచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌ వెంకటనర్సప్ప, అసిస్టెంట్‌ మేనేజర్‌ రాజేశ్‌, సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలి



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని తిప్పాయిగూడ గ్రామస్తులు డిమాండ్‌ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.యాదయ్య మాట్లాడుతూ.. ఆరుట్ల నుంచి చౌటుప్పల్‌ వెళ్లే బస్సును తిప్పాయిగూడ మీదుగా పాత రూట్‌ ప్రకారం నడపాలని, పట్నం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు తిప్పాయిగూడకు వచ్చే బస్సును యాథావిధిగా తిప్పాలని కోరారు. ఇదే విషయమై గతంలో పలుమార్లు డిపో మేనేజర్లకు వినతిపత్రాలు ఇచ్చామని, అయినా స్పందించడం లేదని ఆరోపించారు. ఆందోళన నేపథ్యంలో డిపో నుంచి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడిచి పెట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు గొరెంకల నర్సింహా, రావుల జంగయ్య, యాదయ్య, సుధాకర్‌, శర్మ, ఐలయ్య, మాధవి, కవిత, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లయన్స్‌క్లబ్‌ సేవలు ప్రశంసనీయం

కడ్తాల్‌: గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు లయన్స్‌క్లబ్‌ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని రాంరెడ్డి లయన్స్‌ ఐ ఆస్పత్రి చైర్మన్‌ డాక్టర్‌ దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జంబుల రంగారెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వీల్స్‌ ఆన్‌ మీల్స్‌ అన్న ప్రసాద వితరణ కేంద్రాన్ని లయన్‌ డిస్ట్రిక్ట్‌ మాజీ గవర్నర్‌ చెన్నకిషన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పేదల ఆకలి తీర్చడమే లయన్స్‌క్లబ్‌ లక్ష్యమని తెలిపారు. క్లబ్‌ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్‌ పీఆర్‌ఓ పాషా, కార్యదర్శి మహేశ్‌, సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, చేగూరి వెంకటేశ్‌, అంజయ్య, రాజేందర్‌ యాదవ్‌, వెంకటేశ్‌, బీచ్యానాయక్‌, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు తరలిన కార్మికులు



కలెక్టరేట్‌కు వెళ్లిన కార్మికులు

ఆమనగల్లు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు సోమవారం మున్సిపల్‌ కార్మికులు తరలివెళ్లారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ తీశారు. ఇందులో సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్‌ పెంటయ్య, కార్మికులు రవి, హంసమ్మ, యాదమ్మ, నర్సింహ, విజయ్‌, చిట్టిబాబు, పట్టాభి, సాయి పాల్గొన్నారు.

వైద్యురాలికి సన్మానం



డాక్టర్‌ నందినిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చంద్రదన గ్రామం పల్లె దవాఖానాలో నూతనంగా డాక్టర్‌ నందిని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను, మాజీ సర్పంచ్‌ బక్కి కుమార్‌ తదితరులు సన్మానించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

ఘనంగా మల్లన్న కల్యాణోత్సవం



స్వామివారి సన్నిధిలో భక్తులు

తుర్కయంజాల్‌: పురపాలక సంఘం పరిధి తొర్రూర్‌లో భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి కల్యాణం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారు జామున కల్యాణం, అగ్ని గుండం చేశారు. అనంతరం స్వామి వారిని ఊరేగించారు. వేలాదిమంది భక్తులు ఉత్సవాన్ని వీక్షించారు. రైతుబంధు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

టోర్నీ నిర్వహణకు విరాళం



నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న దాత

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్‌ టోర్నీకి ఆ పార్టీ నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి రూ.50 వేల విరాళాన్ని సోమవారం టోర్నీ బాధ్యులకు అందజేశారు. మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ అజీం, నాయకులు రవీందర్‌యాదవ్‌, రమేశ్‌, ఆంజనేయులు, శ్రీను ఉన్నారు.

వేతన వెతలు తీర్చండి



పంచాయతీ అధికారి సురేష్‌ మోహన్‌ను సన్మానిస్తున్న ఆపరేటర్లు

ఇబ్రహీంపట్నం రూరల్‌: వేతనాలు సకాలంలో అందేలా చూడాలని కంప్యూటర్‌ ఆపరేటర్లు కోరారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌ మోహన్‌ను కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. జీతం తదితర సమస్యలను పరిష్కరించాలని ఆయనకు విన్నవించారు. ఏఓ దుర్గ ప్రసాద్‌, జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌ స్పందన, అసోసియేషన్‌ మండల అధ్యక్షుడు శివశంకర్‌, సలహాదారులు సాయిప్రసాద్‌, కోశాధికారి ప్రభుదాసు, తిరుపతి, శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రీమియర్‌ లీగ్‌ క్రికెట్‌ టోర్నీ



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కోఆర్డినేటర్‌ రాజు

కడ్తాల్‌: మండల కేంద్రంలో ఐదు రోజులుగా ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కడ్తాల్‌ ప్రీమియర్‌ లీగ్‌ క్రికెట్‌ పోటీలు సోమవారంతో ముగిశాయి. సెమీఫైనల్‌కు కడ్తాల్‌ ఈగల్స్‌, స్మాషర్స్‌, హంటర్స్‌ తదితర జట్లు చేరుకున్నాయి. లీగ్‌ దశలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జట్లకు టోర్నీ కోఆర్డినేటర్‌ వరికుప్పల రాజు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఆఖరి పోరు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు వెంకటేశ్‌, రాజు, గణేశ్‌గౌడ్‌, రాజు, జగత్‌రెడ్డి, అనిల్‌గౌడ్‌, శ్రీకాంత్‌, సంతోష్‌, మహేశ్‌, శివ, శంకర్‌ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న నాయకులు

కడ్తాల్‌: ఉప్పల, రాధాకృష్ణ, గంప లక్ష్మయ్య చారిటబుల్‌ ట్రస్ట్‌ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధి మక్తమాధారం గ్రామంలో కామినేని ఆస్పత్రి వైద్యుల సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్‌తో కలిసి డీసీసీబీ డైరెక్టర్‌ గంప వెంకటేశ్‌గుప్తా ప్రారంభించారు. అనంతరం డాక్టర్‌ అఖిల్‌ నేతృత్వంలోని వైద్య బృందం 420మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ సులోచన, మాజీ ఎంపీటీసీ మంజుల, నాయకులు సాయిలు, చంద్రమౌళి, గణేశ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: జల్‌పల్లి మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా 21వ వార్డులో రూ.39.50లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ పైపులైన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు నడిచి వెళ్లేందుకు కూడా వీలులేనట్లుగా ఉన్న రహదారుల స్థానంలో, ప్రస్తుతం బీటీ, సీసీరోడ్లు వేశామని పేర్కొన్నారు. పేదలు నివాసం ఉంటున్న దృష్ట్యా బస్తీ దవాఖానాలను కూడా ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్‌ షేక్‌ అఫ్జల్‌, కౌన్సిలర్‌ పల్లపు శంకర్‌, కమిషనర్‌ వెంకట్రామ్‌, నాయకులు షర్ఫుద్దీన్‌ హామెద్‌, యంజాల జనార్దన్‌, సయ్యద్‌ హుస్సేన్‌, అలీ మన్సూరీ, నగేశ్‌, గోపాల్‌రెడ్డి, బర్కత్‌ అలీ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ జ్ఞానంతోనే మోక్షం

త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి అధ్యక్షురాలు సద్గుణ



భగవద్గీత ప్రచారం చేస్తున్న సభ్యులు

షాద్‌నగర్‌రూరల్‌: సంపూర్ణ జ్ఞానాన్ని సంపాదించినప్పుడే ప్రతీ వ్యక్తికి మోక్షం లభిస్తుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షురాలు సద్గుణ అన్నారు. ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి పండుగల విశిష్టతను తెలియజేసేందుకు ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో సోమవారం ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గుణ మాట్లాడుతూ.. భగవద్గీత జ్ఞానం ప్రకారం క్రాంతి అంటే తిరుగుబాటు అని, సంక్రాంతి అంటే మనిషిలోని దుర్గుణాలపై తిరుగుబాటు అని సూచించారు. సుఖ, భోగ వాంఛలను అగ్నికి ఆహుతి చేయాలని, భోగి మంటలు అనే అగ్నిలో కోరికలు సకల కర్మలను కాల్చివేయాలని సూచించారు. కోరికలు, కర్మలు పూర్తిగా లేనట్లయితే ఉత్తరాయణం రోజు మోక్షంతో విముక్తి లభిస్తుందన్నారు. దక్షిణాయంలో చివరి రోజును భోగి పండుగ అంటారని, కర్మలు అనే కట్టెలు కాలిపోవాలనే సంకేతంతో భోగి రోజున కట్టెలను కాలుస్తారన్నారు. ప్రజలందరూ జ్ఞానులుగా, యోగులుగా మారి జ్ఞానాగ్నితో కర్మలను కాల్చుకోవాలని, ఈ సంక్రాంతి పండుగ అంతరార్థాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు కుల్దీప్‌రెడ్డి, ధన్వంతరి, సుధీర్‌, దినేశ్‌, శిరీష, వాసంతి, సాత్విక, నవ్య, శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

ఆమనగల్లు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెస్‌ చార్జీలను పెంచిందని కాంగ్రెస్‌ నాయకులు అన్నారు. సోమవారం వారు.. తలకొండపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహ, బోల యాదగిరి, మల్లేశ్‌, గణేశ్‌, నర్సింహారెడ్డి, యాదగిరి, పురుషోత్తం, సురేశ్‌, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్‌, మైసయ్య, రాఘవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'పాలమూరు'కు జైపాల్‌ రెడ్డి పేరు హర్షణీయం

మాడ్గుల: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌ రెడ్డి పేరు పెట్టడం హర్షణీయమని కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. భావి తరాలు గుర్తించే విధంగా, నాలుగు జిల్లాలను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసే ఎత్తిపోతల పథకానికి కల్వకుర్తి బిడ్డ, ఉత్తమ పార్లమెంటేరియన్‌ జైపాల్‌ పేరు పెట్టడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

కాలనీ సమస్యలు పరిష్కరించండి

తుర్కయంజాల్‌: పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు. సీపీఐ రాష్ట్ర సభ్యుడు ఓరుగంటి యాదయ్యతో కలిసి ప్రజావాణిలో సోమవారం అడిషనల్‌ కలెక్టర్‌ ప్రతీమా సింగ్‌, డీఆర్‌ఓ సంగీత, విద్యుత్‌ శాఖ డీఈకి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, పేదలు నివాసం ఉంటున్న కాలనీలో విద్యుత్‌ మీటర్లు పెద్ద సమస్యగా మారాయని, నిబంధనల ప్రకారం ఉచితంగా మీటర్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన అది నెరవేరడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మీటర్లను అమర్చాలని కోరారు. జిల్లా సమితి సభ్యుడు పి.శివకుమార్‌, నాయకులు శివ ప్రసాద్‌, యాదయ్య, నరసింహ పాల్గొన్నారు.

ప్రజావాణిలో 22 దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం: ప్రజావాణిలో 22 దరఖాస్తులు అందాయని ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్‌ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్‌ స్థాయి కార్యక్రమంలో ధరణి, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లకు సంబంధించిన అర్జీలు అందాయని వెల్లడించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులకు దరఖాస్తులు పంపించామని పేర్కొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి

నూతన నియామకం



నిఖిలేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న పార్టీ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్‌: బీజేపీ మజీద్‌పూర్‌ గ్రామ అధ్యక్షుడిగా కుంచారపు నిఖిలేష్‌ గుప్తాను నియమించారు. పార్టీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్‌ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిఖిలేష్‌, ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్‌గౌడ్‌, పీర్లగూడెం గ్రామ అధ్యక్షుడిగా చిలువేరు రాజు, ప్రధాన కార్యదర్శిగా లింగస్వామిలను ఎన్నుకున్నారు. అనంతరం నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్‌ నాయకులు పాపయ్యగౌడ్‌, శ్రావణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

'మహా కార్పొరేషన్‌'కు సన్నాహాలు

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, యాచారం మండలాలను ఫోర్త్‌సిటీ పరిధిలో కలిపి మహా కార్పొరేషన్‌ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌ తెలిపారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేశ్వరం, కందుకూరును మున్సిపాలిటీలుగా ప్రభుత్వం ప్రకటించలేదని పేర్కొన్నారు. మున్సిపాలిటీలుగా చేస్తే గ్రామీణ ప్రజలకు ఉపాధి హామీ పథకం వర్తించందనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఉపాధి హామీ పథకం వర్తించే విధంగా కార్పొరేషన్‌కు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని చెప్పారు. ఔటర్‌ రింగు రోడ్డు పరిధి లోపల ఉన్న మున్సిపాలిటీలను ప్రస్తుతం ఉన్న పాలక మండలి సభ్యుల పదవీ కాలం ముగియగానే జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తుందన్నారు. వీటికి ఎన్నికలు జీహెచ్‌ఎంసీతో పాటు జరుగుతాయని పేర్కొన్నారు. అప్పటివరకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుందని స్పష్టంచేశారు. రాష్ట్రంలో మిగిలిన మున్సిపాలిటీలకు 100 రోజుల లోపు ప్రభుత్వం ఎన్నికలను నిర్వహిస్తుందన్నారు. ఫోర్త్‌సిటీ 320 ఫీట్ల రోడ్డు పనులను ఈ నెలలో ప్రారంభమవుతాయన్నారు. ఫోర్త్‌సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య, వైద్యం, వినోదం, ఉపాధి కల్పన ఉంటుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ సీనియర్‌ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రూ.15 వేలు ఇవ్వాల్సిందే..



ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

- రైతు భరోసా కుదింపు తగదు
- బీఆర్‌ఎస్‌ నాయకులు

కడ్తాల్‌: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు చెల్లించాలని బీఆర్‌ఎస్‌ శ్రేణులు డిమాండ్‌ చేశారు. భరోసాను ఏడాదికి రూ.12 వేలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. కాంగ్రెస్‌ మోసాన్ని ఎండగడుతూ బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ఇచ్చిన పిలుపుమేరకు ఆ పార్టీ శ్రేణులు రైతులతో కలిసి సోమవారం శ్రీశైలం- హైదరాబాద్‌ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. రైతు భరోసా కుదింపు తగదని, ఇచ్చిన మాట ప్రకారం రూ.15 వేలు ఇవ్వాల్సిందేనన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్‌, సింగిల్‌విండో చైర్మన్‌ వెంకటేశ్‌గుప్తా, నాయకులు వీరయ్య, నర్సింహాగౌడ్‌, రమణ, సాయిలు, యాదయ్య, లోకేశ్‌, సేవ్యానాయక్‌, లాయక్‌అలీ ఉన్నారు.

మోడల్‌ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: మండలంలోని నేదునూరు పరిధిలోని మోడల్‌ స్కూల్‌లో అడ్మిషన్లు పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ విష్ణుప్రియ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను 6 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 7వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. 6వ తరగతిలో అన్ని సీట్లకు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీలను మాత్రమే భర్తీ చేయనున్నామన్నారు. ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్‌//తెలంగాణఅమ్స్‌ డాట్‌ సీజీజీ డాట్‌ జీఓవీ డాట్‌ ఇన్‌ వెబ్‌సైట్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌ విద్యార్థులకు దరఖాస్తుకు రూ.125, ఇతర విద్యార్థులకు రూ.200 చొప్పున పరీక్ష రుసుం ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. ప్రవేశ పరీక్షకు సంబంధించి ఏప్రిల్‌ 3వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చునని సూచించారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్‌ 13వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. అదే రోజు 7 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.